విశాలాంధ్ర కృష్ణా జిల్లా

27 సచివాలయ నిర్మాణాలు పూర్తి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తిరువూరు డివిజన్ పరిధిలో ఇప్పటికే 27 గ్రామ సచివాలయాల నిర్మాణం పూర్తయిందని డీఈఈ చక్రవర్తి తెలిపారు. డివిజన్‌లోని పలు పంచాయతీల్లో మొత్తం 67 గ్రామ సచివాలయాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వీటిలో ఇప్పటి వరకు 27 సంపూర్ణస్థాయిలో నిర్మాణాలు పూర్తవగా, మరో 40 వివిధ స్థాయిల్లో నిర్మాణాల్లో ఉన్నాయని ఆయన వివరించారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా వీటి నిర్మాణంలో ఆలస్యం నెలకొందని, త్వరలో వీటిని పూర్తి చేయనున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు రావి బాబురావు మృతి

విశాలాంధ్ర-చల్లపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, అవనిగడ్డ నియోజకవర్గ మాజీ కార్యదర్శి రావి బాబురావు(76) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. మూడు రోజులనుండి తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన వక్కలగడ్డలోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రావి రాఘవయ్య-రాజ్యంలకు మూడో సంతానంగా జన్మించిన బాబురావు దివి ఏరియా ప్రాంతంలోని వక్కలగడ్డలో జరిగిన ఉద్యమాలు, భూ పోరాటాల ప్రభావంతో కమ్యూనిస్టు భావాలను పుణికి పుచ్చుకుని కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా తన జీవితాన్ని ప్రారంభించి తుది శ్వాసవరకు బాధ్యత గల కమ్యూనిస్టుగా పార్టీకి తన సేవలను అందించారు. ప్రజానాట్యమండలి కళాకారునిగా, నాయకుడిగా ప్రజా సమస్యలపై తనగళాన్ని వినిపించారు. దివి తాలుకలో కమ్యూనిస్టుపార్టీకి ఎదురైన కష్టకాలంలో పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పార్టీని ముందుకు నడిపించడంలో విజయం సాధించారు. అనేక ఉద్యమ నిర్మాణాలలో ఆయన ముఖ్య భూమిక పోషించారు. ప్రజా కళాకారుడిగా సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై సమాజాన్ని చైతన్య పరచడంలో ఉద్యమ వాణిగా నిలిచారు. ప్రజా కళాకారులు మల్లుపెద్ది కృష్ణమోహన్, రుక్మిణి, డీపీఎస్ ఆర్వీ సుబ్బారావు, హనుమానుల జగన్‌మోహనరావు, అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు, అల్లూరి రామ్మోహన్‌రావులతో కలిసి అనేక కళాప్రదర్శనలు నిర్వహించారు. ప్రముఖ చలనచిత్ర నటులు సుత్తివేలుతో కలిసి ప్రజానాట్యమండలిలో పనిచేశారు. ప్రపంచ దేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఘంటసాల మండలం చుట్టూర్పు గ్రామానికి చెందిన డప్పు కళాకారులు ప్రొఫెసర్ భగవంతరావుతో అత్యంత సాన్నిహిత్య సంబంధాలు కలిగి ఉన్న బాబురావు ప్రజా కళలను ప్రజలకు చేర్చడంలో తుదిశ్వాస వరకు పనిచేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు స్మారకార్థం చల్లపల్లిలో నిర్మించిన సీఆర్ వికాస కేంద్రం నిర్మాణం నిర్వహణలతోపాటు ప్రతి సోమవారం వికాస కేంద్రం నిర్వహించే ఉచిత హోమియో వైద్య శిబిరంలో తన వంతు పాత్ర నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి

వక్కలగడ్డ గ్రామానికి చెందిన బాబురావు గ్రామంలో పార్టీ బలోపేతనికి ఎనలేని కృషి చేశారు. పార్టీ పిలుపుతో జరిగే ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొని పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకొని వెళ్లేవారు. దివి తాలుకాలో జరిగిన అనేక భూ పోరాటాలలో కమ్యూనిస్టు యోధులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు, దాసరి నాగభూషణరావు, కంఠంనేని అచ్యుతరామయ్య, మాలేంపాటి సీతారామయ్య, మాలేంపాటి బాల భాస్కరరావు, దోనేపూడి దత్తు, ఏవి గోపాలరావు, కాకర్ల గోపీచంద్, ఘంటశాల ప్రతాప్, రవణవరపు వెంకటేశ్వర రావు, మల్లుపెద్ది రామసుబ్బయ్య, హనుమానుల వెంకటేశ్వరరావు, నాదేళ్ల స్టాలిన్, గొరిపర్తి రామారావు, ఘంటశాల ఆదిశేషు వంటి నాయకులతో కలిసి అనేక పోరాటాలు చేశారు.

అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శిగా..

సీపీఐ అవనిగడ్డ నియోజకవర్గం కార్యదర్శిగా విధులు నిర్వహించిన రావి బాబురావు ఉద్యమాలలో తనదైన ముద్ర వేసుకున్నారు. కార్యదర్శిగా అతి తక్కువ కాలం పని చేసినప్పటికీ, పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వినూత్న పోరాటాలు చేశారు. ఒక సంవత్సరకాలం మాత్రమే కార్యదర్శి బాధ్యతలు నిర్వహించి ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆ బాధ్యతల నుండి వైదొలిగారు. కార్యదర్శి బాధ్యతనుండి తప్పుకున్నప్పటికీ పార్టీ ఉద్యమాలలో ఎప్పుడు ముందుండేవారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అహర్నిశలు పని చేసేవారు.

బాబురావు మృతి పార్టీకి తీరనిలోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్

రావి బాబురావు మృతి గ్రామానికి పార్టీకి తీరనితోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ అన్నారు. వక్కలగడ్డ గ్రామాభివృద్ధికోసం నిరంతరం పాటుపడేవారని, గ్రామ పెద్దలతో కలిసి అందరితో తల్లోనాలుకలా ఉండేవారని అన్నారు. వక్కలగడ్డ పంచాయతీ పాలకవర్గంలో పనిచేసారని, పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఆయన గుర్తుచేసుకున్నారు.

ప్రముఖుల సంతాపం :

రావి బాబురావు మృతి వార్త తెలుసుకొని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, పార్టీ సీనియర్ నాయకులు పరుచూరి శ్రీనివాసరావు, మాలేంపాటి కాంచనరావు, ప్రజానాట్యమండలి హైదరాబాద్ కార్యదర్శి హనుమానుల జగన్మోహనరావు, మల్లుపెద్ది బోసు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మల్లిపెద్ది రాణీకుమారి, నియోజవర్గ కార్యదర్శి ప్రభుకుమారి, రైతుసంఘం నాయకులు అట్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పాలడుగు ఆనంద్‌బాబు, నక్కశీను, కొర్రపాటి ముఖర్జీ, మల్లుపెద్ది రాజా, హనుమానుల సత్యనారాయణ, పాలడుగు రత్నకుమార్, సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు, పరుచూరి అజయ్, చెరుకు శ్రీనివాసరావు, కోసూరు అప్పారావు, కొండ నాగేశ్వరరావు, కొండవీటి రాంప్రసాద్, చంద్ర రవికుమార్, లంక నాగమల్లి, సిద్ధపత్తుల వాసు, లంక హేమలత, సీపీఎం నాయకులు వాకా రామచంద్రరావు, హరిబాబు, యాద్దనపూడి మధు, శీలం నారాయణరావు, కరీముల్లా, టీడీపీ నాయకులు గుత్తికొండ కోటేశ్వరరావు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు మీర్ రిజ్వాన్, కొండేటి భాస్కరరావు రిటైర్డ్ ఈఓపీఆర్‌డి దాసి సీతారామరాజు తదితరులు బాబురావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రంగు మారి, నూకలైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర -మచిలీపట్నం : వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఈ ఏడాది ఖరీఫ్‌లో అన్నదాతలు నానా ఇబ్బందులు పడ్డారని, ఆరుగాలం కష్టం చేసి తీసుకొచ్చిన రంగుమారి, నూకలైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుకు ఆపన్న హస్తం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్‌ను అభ్యర్థించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన జాయింట్ కలెక్టర్ చాంబర్లో జేసీని కలిసి రైతుల కష్టాలను ఏకరువు పెట్టారు. డిసెంబర్ నెలలో తరచూ బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి, తమిళనాడులో వచ్చిన తుపానుతో కృష్ణాజిల్లాలో వారం రోజులు పాటు ఆకాశం మేఘావృతమై అకాల వర్షాలు పడడంతో ఆందోళన చెందిన రైతాంగం హడావిడిగా కోతలు కోసి పనలను వేశారని, ఆ పనలు సరిగా ఆరకపోవడం, ఆ తరువాత అడపా దడపాగా వర్షాలు కురిచాయని అన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం రైతులు కుప్పలను ఇప్పుడిప్పుడే తీస్తున్నారని, అయితే కుప్పలలోని పనలలో కొంతపాయ, నూకలగా ధాన్యం రాలడంతో రైతులు ఎంతో నిరాశ చెందుతు న్నారన్నారని, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జేసీ అపరాజిత సింగ్, సివిల్ సప్లై డిస్టిక్ మేనేజర్ శ్రీధర్‌కు ఎమ్మెల్యే పేర్ని నాని సూచించారు. ఈ విషయమై, సీఎం జగన్‌ను జిల్లాలోని ఎమ్మెల్యేలందరం కలిసి రైతులు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలో ఇప్పటివరకు 34,600 మంది రైతుల నుండి 3 లక్షల 17 వేల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. 29,500 మంది రైతుల 2 లక్షల 82 వేల టన్నుల ధాన్యానికి సంబంధించిన నగదును భోగి పండుగ ముందు రూ.42 కోట్లు, కనుమ పండుగ రోజు రూ.164 కోట్లు అందజేసినట్లు ఎమ్మెల్యే పేర్ని నాని వివరించారు. ప్రతి ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంలో తేమశాతం కొలిచే పరికరాలు, నూక శాతం లెక్కించే యంత్రాల్లో ఉండేలాగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ సహకార పరపతి సంఘాలే జిల్లాలో దాదాపు 90 శాతం దాన్యం కొనుగోలు చేశారని, రైతు ఖర్చులు సైతం వారే చెల్లించినట్లు ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : వరి కోతల సమయంలో సంభవించిన 'మాండస్' తుఫాన్‌తో కురిసిన అధిక వర్షాలకు వరి పనలపై తడిసిన ధాన్యాన్ని కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని సివిల్ సప్లై జిల్లా డీఎం శ్రీధర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం 16 సచివాలయాల ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలతో, మొవ్వ, ఘంటసాల, గూడూరు, మచిలీపట్నంలోని 15 మంది మిల్లర్లతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. రైతుల నుంచి రంగు మారిన ధాన్యాన్ని కూడా ఖచ్చితంగా కొనుగోలు చేయాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, జిల్లా కో-ఆపరేటివ్ వివి ఫణికుమార్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు ప్రారంభించండి

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఇళ్ల స్థలాలలో ఇంటి నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలని, డ్వామా పిడి జీ.వీ. సూర్యనారాయణ, డి.ఆర్.డి. ఏ.పిడిపి. శివరాం ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈదుల మద్దాల, వెంట్రప్రగడ శివారు పులవర్తి గూడెంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇళ్ల స్థలాలు కేటాయించిన గ్రామంలో సుమారు 500 ఇళ్ల స్థలాలు అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇవ్వడం జరిగింది. ఆ ఇళ్ల స్థలాలలో ఇప్పటివరకు 30 మాత్రమే ఇంటి నిర్మాణం ప్రారంభించడంతో అధికారులు లబ్ధిదారులతో సమావేశమై మాట్లాడుతూ వెలుగు సంస్థ ద్వారా పొదుపులో ఉన్న ప్రతి లబ్ధిదారునికి రూ 35000 లు బ్యాంకు ద్వారా రుణము అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ మల్లికార్జున రావు, ఏపీఎం వసంతరావు, పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, సాంబశివరావు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు బాధ్యత మరిచారు

విశాలాంధ్ర-అవనిగడ్డ : పోలీస్ డిపార్ట్‌మెంట్ కర్తవ్యనిర్వహణలో నీతినిజాయితీలు పనికిరాని వస్తువులుగా భావించి వాటితోనే పోలీస్ డిపార్ట్‌మెంట్ భోగిమంటలు వేసుకోవడం విచారకరం అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతికి ముందు జూదక్రీడలు, కోడి పందాలపై ఆర్భాటపు ప్రకటనలు చేసి సంక్రాంతి మూడు రోజులు తన కను సందనలోనే జూద క్రీడలను నిర్వహించడం ప్రజలు అంతా గమనిస్తున్నారని అధికార పార్టీ నాయకుల అడుగు జాడలలోనే వీటిని నిర్వహింపచేశారన్నారు. వీటిపై సమగ్ర దర్యాప్తు చేయించి, పోలీస్ డిపార్ట్‌మెంట్ కోల్పోయిన పరువు ప్రతిష్ఠలను పునరుద్దీకరించుకోవలని మండలి కోరారు.

మేడికొండ కుటుంబ సభ్యులకు మండలి పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ : మేడికొండ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. సీతాయలంకకు చెందిన టి.డి.పి కార్యకర్త మేడికొండ అనీల్ ఆదివారం రాత్రి హత్యకు గురైన సంఘటన విధితమే. మంగళవారం మేడికొండలో బంధుమిత్రులు, కుటుంబీకులు, స్నేహితులు సందర్శనార్థం అనీల్ మృతదేహాన్ని ఏర్పాటుచేయగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మండలి తనయుడు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ (మండలి రాజా), మండలి అల్లుడు శీలం అశ్వనీలు అనీల్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి, నివాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

అగ్నిప్రమాదం.

విశాలాంధ్ర-కోడూరు : స్థానిక గ్రామ శివారు ముందడగులో మన్నే శివ కేశవరావుకు చెందిన పూరిళ్ళు సోమవారం రాత్రి అగ్నికి అహూతైంది. ఈ అగ్ని ప్రమాదంలో పూరిళ్ళు, వస్తు సామాన్లు, పూర్తిగా కాలిపోగా వారి కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో ప్రాణాలతో బయట పడ్డారు. సర్వం కోల్పుయిన వారిని తక్షణమే ఆదుకోవాలి వారు కోరుతూ కన్నీరుతో విలపిస్తున్నారు.

'స్పందన'తో సమస్యలు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అవ్వడానికి స్పందన కార్యక్రమంలో పోలీసులు చూపిస్తున్న తీరు అభినందనీయమని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నూతన స్పందన సమావేశ మందిరాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్ ఆలోచన మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు జిల్లా కేంద్రం అయిన మచిలీ పట్నంలోని కలెక్టరేట్లో అధికారుల సమావేశాలకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా రూ.కోటి నిధులతో ఇదే రీతిన హంగులతో కూడిన నూతన స్పందన సమావేశ మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి రూ.25 లక్షలు, సీఎస్ఆర్ కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి మరో రూ.75 లక్షలు రాబోయే రెండు మూడు నెలల్లో మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా రూ.ఐదారు కోట్లతో స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా 5 ఎకరాల స్థలంలో క్రీడలు, వాకింగ్ ట్రాక్, వ్యాయామశాల కోసం స్టేడియంను నిర్మించమన్నామని అందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. స్థానిక డా. బి.ఆర్.అంబేద్కర్ భవనాన్ని ఆధునీకరించి, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం కమ్యూనిటీ హాలు నిర్మించి ప్రజల అవసరాల నిమిత్తం అందుబాటులోనికి తీసుకువస్తామని ఆయన తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ వచ్చే ప్రజలకు ఈ విధమైన సౌకర్యాలతో భవనాన్ని నిర్మించడం ఆనందించదగ్గ విషయం అని అన్నారు. అతిధులను జిల్లా ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఇతర పోలీస్ అధికారులు, సచివాలయ మహిళా పోలీస్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు హమాలీ చార్జీలు చెల్లింపు

విశాలాంధ్ర-చల్లపల్లి : మంగళాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులకు హమాలీ చార్జీలను సంఘ చైర్‌పర్సన్, పర్సన్ పేరం నాగిరెడ్డి, కొర్రపాటి ముఖర్జీలు మంగళవారం రైతులకు అందజేశారు. 6వ తేదీ వరకు ధాన్యం తోలిన 150 మంది రైతులకు రూ.2,28,980 అందించారు. ఈ కార్యక్రమంలో చంద్ర వెంకటేశ్వరరావు, కిలారు వెంకటేశ్వరరావు, సంఘ కార్యదర్శి చంద్ర రవికుమార్ రైతులు పాల్గొన్నారు.

దేవుని ప్రేమ జీవితాలను మారుస్తుంది : బ్రదర్ అనిల్ కుమార్

విశాలాంధ్ర-గుడివాడ : ఏసుక్రీస్తు ఆశీర్వాద పండుగల చివరి రోజు పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు ఆశీర్వాద పండుగలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బ్రదర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ బైబిల్ లోని తప్పిపోయిన కుమారుని కథను బోధించి తప్పిపోయిన కుమారుని కోసం తండ్రి ఎదురుచూస్తూ కుమారుడు తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఆ తండ్రి చూపిన ప్రేమను వివరించారు. ఏసుక్రీస్తు మానవాళి పాప క్షమాపణ కోసం సిలువ మరణం పొందినంతగా మనల్ని ప్రేమించి ఆ ప్రేమను తెలుసుకున్న వారి జీవితాలు మారతాయన్నారు. ప్రయాసపడి భారం మోస్తున్న సమస్త జనులారా నా వద్దకు రండి నేను మీకు విశ్రాంతిని కలుగజేస్తానని యేసుక్రీస్తు అన్నారని తెలిపారు. మత మార్పుడి కంటే మనుషుల మార్పు ఎంతో అసరమని బ్రదర్ అనిల్ కుమార్ తెలిపారు. సంగీత బృందాలు ఆలపించిన భక్తి గీతాలు విశ్వాసులు యొక్క హృదయాలను ఆకట్టుకున్నాయి బ్రదర్ అనిల్ కుమార్ ప్రార్థన ద్వారా దేవుడు చేసిన అద్భుతాలను ఎల్ఈడి స్క్రీన్ ల ద్వారా ప్రదర్శించారు. రోగుల కొరకు ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ క్రైస్తవ నాయకులతో పాటు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు రాజకీయ నాయకులు పాల్గొన్నారు

క్రైస్తవ స్మశాన వాటికను ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర-గుడివాడ : ఆర్డీఓ కార్యాలయం వద్ద దళిత క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గుడివాడలో వెంటనే దళితుల కొరకు క్రైస్తవ స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. పాతిక సంవత్సరాలుగా అనేక మందిని విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం వల్ల నేడు దుర్భర పరిస్థితిలో నాలుగు ప్రాంతాలకు చెందిన క్రైస్తవ కుటుంబాలు ఎవరైనా మరణిస్తే ఒకే చోట పాతిపెట్టే ధర్భర్మైన స్థితిలో ఉన్నామని ఇప్పటికైనా దీని నుండి ప్రభుత్వం స్పందించి విముక్తి కలిగించాలని లేనిపక్షంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద చనిపోయిన వారి మృతదేహాలను పూడ్చి పెడతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వేసుపోగు విజయ్ బాబు, జడ జాన్ రాజు, బలసాని ఎలీషా, తాళ్ళూరి ప్రశాంత్, కంచర్ల సుధాకర్ వెంపటి సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట : సామినేని

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ రోడ్డు లో జగ్గయ్యపేట పట్టణ ముస్లిం మైనారిటీ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ అలితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లింలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని వారి సంక్షేమాన్ని వీడి మొండి చేయి చూపించారని, కానీ ఆ తర్వాత దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు వారి సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసి వారి సంక్షేమానికి పెద్దపీట వేశారని ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తనకే దక్కుతుందని తెలిపారు. నేడు ఆయన బాటలోనే మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నడుస్తూ ముస్లింల అభ్యున్నతకు కృషి చేస్తున్నారని తెలిపారు. నేడు జగ్గయ్యపేటలో మైనార్టీల కోసం ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషదాయకమని అన్నారు. త్వరలో పట్టణంలో రూ.80 లక్షలతో షాదిఖానా ఏర్పాటు చేస్తామని, భీమవరంలోని రెండు మసీదులకు రూ.80 వేలు ఆర్థికంగా వారికి ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రన్ హుసేన్, షాది ఖానా చైర్మన్ ఎక్బైడ్ భాషా, సొసైటీ అధ్యక్షులు బాల సైదా,ముస్లిం మైనార్టీ నాయకులు ఫిరోజ్ ఖాన్, అక్బర్ ఖాన్, జుబేర్, రిటైర్డ్ ఎస్ఎస్పి ఖాసిం సైదా,కో ఆప్షన్ ఖదర్ బాబు, ఖాజా, షాబుద్దీన్, నాగులు హుస్సేన్, సుప్రీం కోర్టు లాయర్ హసద్, అబ్దుల్ రజాక్, ముస్లిం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించడానికి ధ్యానం సహాయపడుతుంది

స్థానిక మినీ బైపాస్ రోడ్డులోని బుద్ధ విహార్ పార్క్‌లో గౌతమ బుద్ధ ధ్యాన కేంద్ర నిర్మాణనికి రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను హిమాలయ యోగి సంపత సదానంద గిరి మహారాజ్ కలసి శంకుస్థాపన చేశారు. ఉదయభాను మాట్లాడుతూ నేటి సమాజంలో ధ్యానం ద్వారానే మంచి శరీరం, మంచి మనస్సు, ఆత్మసాక్షాత్కారం అనే అంతిమ లక్ష్యాన్ని మనుషులు సాధించగలరు అని అన్నారు. ఈ బుద్ధ విహార్ ఉన్న చెరువును సుమారు 5 కోట్ల రూపాయలతో చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి అలాగే గ్రీనరీ,లైట్లు తో మంచి పర్యాటక కేంద్రంగా ఊరా చెరువును అభివృద్ధి చెయ్యడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్,గింజుపల్లి వెంకటరామయ్య,కో ఆప్షన్ ఖాదర్ బాబు, పసుపులేటి రాధా సుబ్రహ్మణ్యం, లాయర్ సత్య శ్రీనివాస్, ధ్యానరత్న వెలగపూడి లక్ష్మణరావు, తమ్ముంద్రు నాగేశ్వరరావు, మీసాల బాలాజీ, మల్లికార్జున్‌రావు, వసంత టెంట్ హౌస్ ప్రసాదు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు నిత్యావసరాలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : గ్రామంలో ఇటీవల అగ్నికి మూడు పూరిళ్లు దగ్ధమై పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్రయులైన పెదపారుపూడి గ్రామంలోని మానుపాటి వీర బ్రహ్మం, నగుళ్ల శ్రీరాములు, తోట నాగేశ్వరరావులకు మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా నగదు, బియ్యం ఒక కట్టచొప్పున ముగ్గురు బాధితులకు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడిలో ప్రారంభమైన 'సావిత్రి గౌరీ నోములు'

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడిలో తొమ్మిది రోజులపాటు జరిగే సావిత్రి గౌరీ నోములు ముక్కనుమ రోజైన మంగళవారం నుంచి ప్రారంభమైనాయి. గ్రామంలో పురోహితుడు జంధ్యాల పాండురంగ శర్మ ఇంటి వద్ద సామూహికంగా మహిళలు (ముత్తైదువులు) నిర్వహించుకునే ఈ నోముల కోసం గుంటూరు జిల్లా పెదవడ్లపూడి నుంచి బొమ్మలను తీసుకొచ్చి వేకువజామున మంగళ వాయిద్యాలు నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిత్యవారి వివిధ రకాల పుష్పాలతో నిర్వహించే విశేష పూజలు కొనసాగించారు. ఈకార్యక్రమాన్ని విజయవాడకు చెందిన పురోహితులు జోశ్యుల శ్రీ హనుమత్ కృష్ణ ప్రసాద్ శర్మ నిర్వహించారు.

'విశాలాంధ్ర-2023' క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -కృత్తివెన్ను : 2023 విశాలాంధ్ర కేలండర్‌ను ఎంపిపి కూనసాని గరుడ ప్రసాదు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఎంపిపి మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రికకు శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఆశాకిరణం విశాలాంధ్ర పత్రికని కోనియాడారు. వార్తల ప్రచరణ ఒక్కటే కాకుండా తెలుగుసాహిత్య విలువలను కాపాడుతూ వార్తలను ప్రచురించడం విశాలాంధ్ర పత్రిక ప్రత్యేకతన్నారు. 75 సంవత్సరాల సుదీర్ఘకాలం పాత్రికేయ విలువలలో రాజీపడకుండా కోనసాగుతుందన్నారు. ఎక్కడ ప్రజా సమస్యలుఉంటే అక్కడ విశాలాంధ్ర ఉటుందన్నారు. భవిష్యత్తులోకూడా పత్రిక ఇదే ఒరవడితో కోనసాగాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పిచ్చిబాబు, కార్యాలయ సూపరిడేంట్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే ముఖ్యమంత్రినే ఎన్నుకోండి : ఎమ్మెల్యే సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలన్ని కలిసి పోటీ చేసిన సీఎం జగన్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. వేకనూరు సచివాలయ పరిధి గుడివాకవారిపాలెం పరిధిలో మంగళవారం గడప గడపకి మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి రమేష్ బాబు ఇంటింటికి తిరిగి అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాలను పంపిణీ చేస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీ నారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, వేకనూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు తుంగల వేణుగోపాలరావు, వేకనూరు ఎం.పి.టి.సి వర్రె నరేష్, మండల కో- ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ భాషా, అవనిగడ్డ ఉప సర్పంచ్ గాజుల జయగోపాల్, నాయకుడు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 41 సీఆర్పీ చట్టాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : మాదిగలను ఏ,బి,సి,డిలుగా వర్గీకరించాలని, ఈనెల 30 నుండి జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, భారతదేశంలోని కులాల గణంకాల ప్రకారం 50% నుంచి 80% రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఎంఆర్పిఎస్ డిమాండ్ చేసింది. మంగళవారం ఏపీ ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఆదేశాల మేరకు గుడివాడ నియోజకవర్గం ఏపీ ఎమ్మార్పిఎస్ నాయకులు గుడివాడ ఆర్డిఓ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీస్ స్టేషన్ బెయిలు ఇచ్చే 41 సిఆర్పి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల సుధాకర్, వెంపటి సైమన్, కొదమల్ల గంగాధర్ ,తాళ్లూరి ప్రశాంత్ ,వేసుపోగు సాగర్, ఐనంపూడి సురేష్, కాటూరి శ్రీనివాసరావు, అత్తటిసాల్మన్, వంగూరి చిన్నసత్యానందం వేసుపోగు నహీమియా, కంచర్ల విజయ్, బలసాని యోహాను బలసాని ఎలీషా, వంగెవరపు రవితేజ,తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MIMUNNISA (old Name) w/o. Mohammed Saheb, R/o.4-95, Indira Nagar-1, Penamaluru, Krishna District, Andhra Pradesh - 521137 Have Change My Name to MOHAMMED MAIMUNNISA (New Name) Here after My Name is known as MOHAMMED MAIMUNNISA

నేడు చెరువు సెంటర్ ప్రాంతంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పర్యటన

విశాలాంధ్ర–విజయవాడ : టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని, జగనన్న ఇళ్లకు ఇస్తున్న రూ.1,80,000 నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కోరుతూ లబ్దిదారులతో కలిసి విద్యాధరపురం చెరువు సెంటర్ ప్రాంతంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పర్యటిస్తారని పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని అనంతరం ఉప్పలపాటి సుబ్బరాజుభవన్‌కు విచ్చేసి విలేకరులతో మాట్లాడతారని పేర్కొన్నారు.

మండల కేంద్రం తరలింపు ఆపకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం

33వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర–వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడులోని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 33వ రోజు రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామ మహిళలు మంగళవారం పాల్గొన్నారు. 33వ రోజున రిలే నిరాహారదీక్షలో గద్దం వరమ్మ, ఇనపనూరి శకుంతల, లంక నిర్మల, చాట్ల మరియమ్మ, గద్దం వెంకట్రావమ్మ, మార్కపూడి నాగేంద్ర, యాం పోగు యశోద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ మండల కేంద్రం తరలింపు నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ నిరసనను రోజు రోజుకి ఉధృతం చేస్తామని తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర–విజయవాడ క్రైం: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఫకీర్‌గూడెంకు చెందిన కృష్ణ(28) మద్యానికి బానిసైయ్యాడు. ఈ మేరకు ఇంట్లో ఎవరు లేని సమయంలో బ్లేడుతో కోసుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి వచ్చి చూడగా ఫ్యాను వెళాడుతూ కనిపించాడు. ఈమేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమనాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఇంటికి రూ.5లక్షలు, టిడ్కో ఇళ్ల సాధనే లక్ష్యంగా లబ్ధిదారులు

ఉద్యమాలకు సన్నద్ధం కావాలి

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర–విజయవాడ : గూడు, నీడలేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేరాలంటే ప్రభుత్వ నిధులతోనే నిర్మాణాలను పూర్తి చేయాలని, లేదా ఇంటికి కనీసం రూ.5లక్షలు నిర్మాణ ఖర్చుల నిమిత్తం ఇవ్వాలని, అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను కనీస మౌలికవసతులతో పూర్తిచేసి లబ్దిదారులకు తక్షణమే అప్పజెప్పడమే లక్ష్యంగా లబ్ధిదారులు సమైక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘాలిచ్చిన పిలుపుమేరకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో మంగళవారం సీహెచ్.కోటేశ్వరరావు పర్యటించి జగనన్న ఇళ్ల లబ్ధిదారులను స్వయంగా కలిసి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం లబ్ధిదారులతో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఇంటికి ప్రస్తుతం ఇచ్చే రూ.1.80 లక్షలు కనీసం పునాదులకు కూడా చాలడంలేదని, పూర్తి కావటానికి రూ.10 నుంచి 12 లక్షలు వరకు నిర్మాణ ఖర్చులు అవుతున్నాయనీ, అదీ కూడా కుటుంబం అంతా పనిచేస్తేనే ఇంత ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం వారి ఖర్చులో సగం, కనీసం రూ.5లక్షలు ఇస్తే ఏదోకవిధంగా పూర్తి చేసుకుంటామని లబ్ధిదారులు కోరుకుటుంన్నట్లు చెప్పారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించాలని, రూ.5 లక్షల ఇవ్వాలనే డిమాండ్ సాధన కోసం లబ్ధిదారులంతా ముక్తకంఠంతో ముందుకు కదలాలని కోరారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘాలు మీకు వెన్నుదన్నుగా ఉంటాయని తెలిపారు. అనంతరం వ్యక్తిగత దరఖాస్తులపై లబ్ధిదారులైన పేద మహిళలు కోటేశ్వరరావు సమక్షంలో సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉప్పె నరసింహారావు, స్థానిక సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఇస్లావతు సాంబయ్య, భూక్యా దేశ్య, లక్ష్మీ నారాయణ, రాయప్ప, కంపా లక్ష్మయ్య, తిరుపతమ్మ, ఇస్లావతు పీకి తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెంలో...

సీపీఐ ఆధ్వర్యంలో పోరుబాటలో భాగంగా మంగళవారం గంపలగూడెంలో సంతకాల సేకరణ కార్యక్రమం సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగల్‌మీరా ఆధ్వర్యంలో నిర్వహించారు. జగనన్న కాలనీ ఇల్లు అర్హులైన పేదలందరికీ నిర్మించి త్వరగా అందజేయాలని కోరారు. పార్టీ ఆదేశాల మేరకు సంతకాల సేకరణ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి గొర్రాజు రామకృష్ణ, సహాయ కార్యదర్శి కుమ్మరికుంట్ల రామారావు, ఎస్‌కే బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ వేగవంతం : జేసీ

విశాలాంధ్ర–విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) సరఫరాను వేగవంతం చేయాలని మిల్లు యజమానులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ మంగళవారం జిల్లాలోని మిల్లు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిల్లు యజమానులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి త్వరితగతిన అందించే విధంగా చర్యలు చేపట్టి పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతున్నాయని, ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని రైతుల వద్ద నుండి రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు సెక్యూరిటీ సమస్యలు ఉన్నాయని మిల్లర్లు జేసీ దృష్టికి తీసుకురాగా, దీనిపై స్పందించిన జేసీ మిల్లర్ల సమస్యలను ఫోన్ ద్వారా బ్యాంకర్లతో చర్చించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో పీ.కోమలి పద్మ, జిల్లా మేనేజర్ శ్రీరామమూర్తి జిల్లాలో పలు రైస్ మిల్లు ప్రధినిధులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర–తిరువూరు: మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు, ఫిబ్రవరి 7 నుంచి 10 వరకు కేంద్రాలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సేవలందిస్తాయని తెలిపారు. 19న మల్లేల, 20న కాకర్ల, 21న కోకిలంపాడు, 23న ముష్టికుంట్ల, 24న చౌటపల్లి, ఫిబ్రవరి 7న చింతలపాడు, 8న జి కొత్తూరు, 9న ఎర్రమాడు,10న లక్ష్మీపురం గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల సేవలను గ్రామస్తులు వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు.

అనాధలకు... పౌష్టికాహారం

విశాలాంధ్ర–తిరువూరు: ఆకలితో అలమటిస్తున్న అనాధలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా పరిపూర్ణ ట్రస్టు పనిచేస్తుందని సంస్థ డైరెక్టర్ సిరికొండ నాగేశ్వరరావు తెలిపారు. మంగళ వారం స్థానిక జంగాల కాలనీలో నిరుపేద చిన్నారులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ఉద్యోగులుగా పనిచేస్తున్న వరలక్ష్మి, షకీలా, ఖమ్మం జిల్లా అడసర్లపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, కల్లూరు ఎస్ కే రేష్మా లు ఒక బృందంగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సంపన్న కుటుంబాల వారు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఆర్థికంగా స్థిరపడిన వారు ఆయా సందర్భాలలో నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి ఆర్థిక చేయూత అందించి, సహకరించాలని నాగేశ్వరరావు కోరారు.

జిల్లాస్థాయి ఈవీఈ రూరల్ షటిల్ విన్నర్స్ కొత్తూరు తాడేపల్లి

విశాలాంధ్ర–విజయవాడ (వన్‌టౌన్): సంక్రాంతి పండుగ సందర్భంగా స్వచ్ఛంద సంస్థలకు మద్దతుగా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఇవిఇ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి నాన్ మెడలిస్టుల అవుట్‌డోర్ షటిల్ బ్యాడ్మింటన్‌లో కొత్తూరు తాడేపల్లి యువత విన్నర్స్‌గా నిలిచాయి. సీనియర్స్‌లో విజయ్, సతీష్ జోడి, జూనియర్స్ విభాగంలో ఫణి, సూర్య జంట విజేతలుగా నిలిచాయి. మూడు రోజులపాటు నిర్వహించిన పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. సీనియర్స్ ఫైనల్స్‌లో కొత్తూరు తాడేపల్లికి చెందిన భాను, కల్యాణ్ జోడిపై అదే గ్రామానికి చెందిన విజయ్, సతీష్ ద్వయం విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. అలాగే జూనియర్స్ విభాగంలో విజయవాడ నగరానికి చెందిన తేజ, సోను ద్వయంపై కొత్తూరు తాడేపల్లికి చెందిన ఫణి, సూర్య జంట గెలుపొంది విజేతగా నిలిచింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కారెంపూడి కృష్ణకుమారి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇవిఇ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్, ఇంజనీర్ ఈడా వేదాద్రి, త్రివేణీ కాలేజీ (జి కొండూరు) ప్రిన్సిపాల్ పామర్తి శ్రీనివాసరావు, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు ఎం మురళీ, అతిథులు పలగాని ప్రసాద్, సిహెచ్ హరీష్, పి రంగనాయకులు, పులి నాగమల్లేశ్వరరావు, ఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీవీఎస్ మోపెడ్ దగ్ధం

విశాలాంధ్ర–విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ఒక టీవీఎస్ మోపెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. స్థానిక అంబేద్కర్ కూడలి సమీపంలోని జయ లాడ్జిలో కాపలాదారులగా వ్యవహరిస్తున్న బందారు మోహనరావు అనే వ్యక్తి ఇదే లాడ్జి ప్రాంగణంలో ఉంచి, తన విధులు నిర్వర్తిస్తుండగా, సోమవారం అర్ధరాత్రి దాటిన అనంతరం కొందరు ఈ చర్యకు పాల్పడ్డారు. రాత్రి సుమారు ఒంటి గంట అనంతరం పెద్దఎత్తున పొగలు వ్యాపించటంతో తాను పరిశీలించగా, అప్పటికే దగ్ధమవుతున్న మోపెడ్‌ను గుర్తించానని బాధితుడు తెలిపారు. అతని వాహనంతోపాటు, సమీపంలో ఉన్న ఒక కూల్‌డ్రింక్ దుకాణానికి చెందిన ఫ్రిజ్, విద్యుత్ సరఫరాకు చెందిన మరికొంత సామాగ్రికి నష్టం వాటిల్లింది. పోలీసులు ఈ విషయమై విచారణ చేపట్టారు. ఈ ప్రాంతంలో ఉన్న సీసీ టీవీలో ఉన్న వీడియోలను పరిశీలిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు

విశాలాంధ్ర–విజయవాడ కార్పొరేషన్ : నగర వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ జనావాసాలల్లోకి వస్తున్న పందుల నిర్వాహకులు, రోడ్లుపై పశువులను వదిలే యజమానులు, నగర వీధుల్లో చెత్త వేస్తూ నిబందనలు ఉల్లంఘిస్తున్న పలువురిపై మొబైల్ కోర్టు న్యాయమూర్తి జరిమానా విదిస్తూ తీర్పు చెప్పారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాలు మేరకు ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టు నిర్వహణలో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి యు.రామ్మోహన్ మంగళవారం సర్కిల్–3 కార్యాలయంలో మొబైల్ కోర్టును నిర్వహించారు. సర్కిల్–3కు సంబందించిన శానిటరీ ఇన్స్పెక్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై 16 కేసులు నమోదు చేసి వారిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. నగరంలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారు, విచ్చలవిడిగా పశువులను రోడ్లుపైకి వదిలివేస్తూ పారిశుధ్య నిర్వాహణకు విఘాతం కలిగిస్తున్నవారిపైన, రోడ్లుపై చెత్త వేసే వారిని వివిధ నేరాల క్రింద న్యాయమూర్తి రూ.5 వేల 60 జరిమానాలు విదించారు. మరోసారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం న్యాయమూర్తి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా విజయవాడను మార్చేందుకు శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు ప్రతిరోజు ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ అమ్మే షాపులను తనిఖీ చేసి అందరు విధిగా ప్లాస్టిక్ నిషేదం అమలు చేయాల్సిందిగా అదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిచంద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ రూ.26వేల విరాళం

విశాలాంధ్ర–నందిగామ : కంచి కామకోటి పీఠం శ్రీమతం సంస్థానం నిర్వహించే ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 26 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎన్.ఎన్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నందిరాజు ప్రకాష్, నందిరాజు రాజా హనుమంతరావు మంగళవారం అందజేసినట్లు తెలిపారు.తమ తండ్రి నందిరాజు శ్రీహరిరావు 77వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ ఆర్థిక సహాయాన్ని పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సొసైటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్టుకి ఎమ్మెల్సీ ఆర్థిక సాయం

విశాలాంధ్ర–నందిగామ: పట్టణంలో జర్నలిస్టు సింగంశెట్టి సత్యనారాయణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా మంగళవారం సత్యనారాయణ నివాసంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ పరామర్శించారు. సత్యనారాయణకు ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేకరులు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు

విశాలాంధ్ర–విజయవాడ క్రైం: రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన మంగళవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కంచికచర్లకు చెందిన బత్తుల నరసింహారావు(23) తన ఆటో పై రామవరప్పాడు నుండి గన్నవరం వైపు వెళ్తున్న సమయంలో ఎనికేపాడు వద్ద రోడ్డు మీద ఆగిఉన్న లారీ ఢీకొట్టింది. దీంతో డ్రైవర్‌కు ముఖం పై తీవ్రగాయాలై పరిస్థితి విషయంగా ఉంది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయండి.. : తిమ్మాపురం గ్రామస్తులు

విశాలాంధ్ర–వీరులపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన నిర్వహించారు, అనంతరం మండల తహశీల్దార్ జి.విక్టర్ బాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. బాధితులు అందించిన సమాచారం ప్రకారం తిమ్మాపురం గ్రామ పరిధిలోని సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చెరువులో చేపలు పెంచుకొని విక్రయించేందుకు 70 మంది సభ్యులతో 2011లో తిమ్మాపురం ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ పేరుతో సంఘాన్ని రిజిస్టర్ చేశారు. గత మూడు సంవత్సరాల నుండి గూడెం మాధవరం కు చెందిన అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటున్నారని తమకు జీవనాధారమైన చేపలను పట్టనివ్వకుండా వ్యవహరిస్తున్నారని సంఘ సభ్యులు ఆరోపించారు. వేసవికాలంలో చెరువులో ఉన్న కొంత నీటిని రెగ్యులేటర్ ద్వారా పంపించి తద్వారా చేపలు పట్టుకుని పట్టుకుంటామని, గత మూడు సంవత్సరాలుగా కొంతమంది అధికార పార్టీ నాయకులు రెగ్యులేటర్ కు అడ్డంగా మట్టి పోసి అడ్డుకుంటున్నారని వాపోయారు. తమకు సరైన న్యాయం చేయాలని మండల తహశీల్దార్ కి వినతి పత్రాన్ని అందజేశామని వారు తెలిపారు.

కోడిపందేల బరులను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర–విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో పెద్దఎత్తున సాగిన కోడిపందాల బరులను మంగళవారం పోలీసుశాఖ ఉన్నతాధికారులు పరిశీలన చేశారు. మైలవరం ఏసీపీ ఎం.రమేష్ విస్సన్నపేట మండలంలో ఏర్పాటు చేసిన పలు బరులను పరిశీలించి, ఇకపై జూదాలు, పందాలు కొనసాగకుండా తీసుకోవలసిన చర్యలపై ఎస్ఐ పి.కిశోర్‌కు సూచనలు చేశారు. విస్సన్నపేటలో కోడిపందాల కారణంగా ఘర్షణకు దారి తీసిన పరిస్థితులు, ఇటువంటి ఘటనలు మరోమారు జరగకుండా తీసుకోవలసిన చర్యలపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.

హెల్మెట్ ధరించడం సురక్షితం : ఎస్ఐ

విశాలాంధ్ర–కంచికచర్ల: సురక్షితంగా గమ్యం చేరడానికి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కంచికచర్ల ఎస్ఐ సుబ్రహ్మణ్యం వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులను ఆపి హెల్మెట్ వాడటం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలు జరిగితే సంభవించే నష్టాలు గురించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మంగళవారం కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ వినియోగం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి సురక్షిత ప్రయాణం చేసి క్షేమంగా గమ్యస్థానాలు చేరుకోవాలని సూచించారు.

మహిళను కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

విశాలాంధ్ర–విజయవాడ : ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం కాపాడిన ఘటన మంగళవారం జరిగింది. ఆర్ఎస్ఐ ఎం.వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరికి చెందిన దుర్గా అనే మహిళ ప్రకాశం బ్యారేజీపై నుంచి కృష్ణానదిలో దూకింది. మహిళ వయస్సు 41 సంవత్సరాలు. ఆమె సాయంత్రం 5 గంటల సమయంలో బ్యారేజీపై 60వ నంబరు పిల్లర్ వద్ద నుంచి నదిలోకి దూకింది. దుర్గాఘాట్ వద్ద విధుల్లో ఉన్న ఏపీఎస్పీ చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం మహిళ దూకటాన్ని గమించిన నదిలో కొట్టుకుపోతున్న ఆమెను రక్షించిన బయటకు తీసుకుచ్చారు. అనంతరం బాదితరాలును స్థానిక పోలీసులకు అప్పగించారు.

నిత్య సహాయ మాత మహోత్సవాలు

విశాలాంధ్ర–వీరులపాడు: మండలంలోని జగన్నాధపురం గ్రామంలో నిత్య సహాయ మాత మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు.జోసఫ్ సుగుణరావు ఆధ్వర్యంలో నిత్య సహాయ మాత మహోత్సవాలు గత 11 రోజులుగా ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి దివ్య బలి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్య సహాయ మాత మహోత్సవాలకు ఫాదర్ సుగుణ రావు నేతృత్వంలో అనేకమంది గురువులతో బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు.భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామ పురవీధులలో మరియమాత స్వరూప ప్రదక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

ఆటో ఎక్స్ పోలో 'ప్రేరేపిత భవిష్యత్తు' ప్రదర్శనను ఇవ్వనున్న కియా ఇండియా

విశాలాంధ్ర–విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతి వేగంగా పెరుగుతున్న కారు తయారీదారు, కియా ఇండియా, రాబోయే ఆటో ఎక్స్ పో 2023లో ప్రయాణం భవిష్యత్తును చూపించడానికి సిద్ధంగా ఉంది. ఆటోమొబైల్ లో నవ్యతను ప్రతిబింబించడానికి రూపొందించబడిన బ్రాండ్ తమ కాన్సెప్ట్ ఈవీని ప్రదర్శిస్తుంది. కియా కాన్సెప్ట్ తో పాటు, దేశంలో తమ ఆర్వీ నాయకత్వాన్ని మరింత శక్తివంతం చేయడానికి ద్వివార్షిక ఆటోమోటివ్ ఆర్భాటంలో ప్రత్యేకమైన ప్రయాణ పరిష్కారాలను, పెద్ద ఆర్ వీ– కేఏ4ను కూడా విడుదల చేస్తుంది. పెవిలియన్ లో ప్రత్యేకమైన విభాగం ద్వారా సందర్శకులు కియా ఇండియా వారి గొప్ప ప్రయాణాన్ని చూడవచ్చు.

ఈశ్వరమ్మ ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు

విశాలాంధ్ర–పెనుగంచిప్రోలు : చెరువుకట్ట బజారు దాసరిపల్లిలో పురాతన దేవాలయ పునఃనిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే, మరియు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకి సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్ వినతి పత్రాలు ఇచ్చారు. వారి ఉత్తర్వులు మేరకు మంగళవారం పెనుగంచిప్రోలులో ఈశ్వరమ్మ దేవి దేవాలయానికి ద్వారక తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి. భాస్కర్‌రావు, నందిగామ డివిజన్ ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ కే.వి. అనురాధ. మంగళవారం ఆలయానికి విచ్చేసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్వారక తిరుమల తిరుపతి దేవస్థానం నుండి ఈశ్వరమ్మ అమ్మవారి మందిర పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషితో ఆదేశాల మేరకు ఎండోమెంట్ ద్వారా నిధులు మంజూరయ్యాయని అన్నారు. సర్పంచి వేల్పుల పద్మకుమారి దంపతులు మాట్లాడుతూ ఈశ్వరమ్మ దేవి ఆలయం కావాలని ఉదయభానుకి లెటర్ ఇవ్వడం, ఆపై వారి కృషి ఫలితంతో ద్వారక తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. బి.వి భాస్కరరావు ఇక్కడ విచ్చేయటం మరియు నందిగామ డివిజన్ ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ అనురాధ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని ఆలయాన్ని సందర్శించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, దాసరపల్లి 11వ వార్డు మెంబర్ చేని సునీత, రాష్ట్ర వైఎస్ఆర్సిపి బీసీ నాయకులు మాజీ అధ్యక్షులు చేని రాంబాబు, దాసరి కుల సంఘం అధ్యక్షులు చేని ఆంజనేయులు, దాసరి కుల సంఘ పెద్దలు కంభం కోటేశ్వరరావు, సుంకర కొండలు, తుపాకుల వెంకటరమణ, దాసరి కుల మాజీ అధ్యక్షులు చేని కోటేశ్వరరావు, చేని శ్రీనివాస రావు, చేని మహేష్ ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ చేని ప్రతాప్, కంచి రంగయ్య, పోలేపల్లి శేషగిరి, చేని అశోక్ కుమార్, చేని వెంకన్న, చేని గోపి, చేని రాములు, నాయిబ్రాహ్మణ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

KVB Karur Vysya Bank Smart way to bank

బందరురోడ్డు, విజయవాడ.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకు వారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు కావున తెలియజేయడమైనది.

వేలం జరుగు స్థలము : ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, బందరురోడ్డు బ్రాంచి, డోర్ నెం : 38-8-46, ఎం.జి.రోడ్డు, లబ్బీపేట, కృష్ణాజిల్లా, విజయవాడ-520010. ఫోన్స్ : 0866-2485702, 2487349

నగల తనిఖీ, సమయం : 30/01/2023 మ॥3-00 గం.ల నుండి మ॥ 3-30 గం.ల వరకు

వేలం జరుగు తేదీ, సమయం : 30/01/2023 మ॥ 3-45 గం.లకు.

వ. సం.	ఋణగ్రహీత పేరు & చిరునామా	ఖాతా నెం.	మొ॥ బరువు	నికర బరువు
1	దేను వాగేంద్రబాబు, డోర్ నెం : 24-28- 6/10 ఈడ్పుగంటి లక్ష్మణరావు దుర్గాపురం వీధి, విజయవాడ అర్బన్ ఆంధ్రప్రదేశ్- 520003.	1441802000009620	37.8	35.9
2)	అడుసుమిల్లి మోహనరావు 6-105, ఎస్.సి.ఆర్ సెంటర్, ప్రసాదం పాడు, రామవరప్పాడు, విజయవాడ ఆంధ్రప్రదేశ్- 521108.	1441802000009815	45.3	43.0

ముఖ్య నియమ నిబంధనలు :

1) పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీచేసిన నోటీసులకు (అవి ఏ కారణము చేతనైనను తిరిగి వచ్చినను) టీనినే ఆఖరి నోటీసుగా భావించ వలసినది.
2) ఒక వేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
3) ధరావత్తును బ్యాంక్ వారిచే వేలం తేదీ మ॥ 3-30 గం.ల వరకు మాత్రమే స్వీకరించబడును.
4) విజయవంతమైన పాటదారుడు వేలం తేదీ మ॥ 4-00 గం.ల లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను.
5) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరి చూసుకోవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు.
6) ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండానే వేలంను పాక్షికముగా గానీ పూర్తిగా గాని రద్దు చేయు అధికారము బ్యాంక్‌కు కలదు.
7) పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికముగా దాఖలు చేయుట తప్పనిసరి.
8) ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు పైన ఉదహరించిన బ్రాంచి నందు సంప్రదించగలరు.
9) అమ్మకపు పన్నును కొనుగోలుదారుడే భరించవలసి ఉంటుంది.

విజయవాడ 17-01-2023 | ఇట్లు ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్., బ్రాంచి మేనేజర్